ఫోన్ పోయిందా.. చింతొద్దు



కోటమిట్టకు చెందిన షఫీకి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి (ఫైల్)

- అందుబాటులో సీఈఐఆర్ సేవలు
- మొబైల్ హంట్ ద్వారా బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

నెల్లూరు(క్రైమ్): ప్రస్తుత జీవనశైలిలో సెల్‌ఫోన్ అత్యంత కీలకమైంది. సమాచారం తెలుసుకోవాలన్నా.. నగదు చెల్లింపులు జరపాలన్నా.. ఏదైనా దరఖాస్తు చేసుకోవాలన్నా దీనిపైనే ఆధారపడుతున్నాం. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న సెల్‌ఫోన్ చోరీకి గురైనా.. పోయినా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించనవసరం లేదు. పోయిన ఫోన్లను వెతికేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం మొబైల్ హంట్ సేవలను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. 91543 05600 నంబర్‌కు వాట్సాప్ చేస్తే మెసేజ్ వస్తుంది. లింక్‌ను ఓపెన్ చేసి వివరాలను అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్‌ను పోలీసులు ట్రేస్ చేసి అప్పగిస్తున్నారు.

664 మొబైల్ ఫోన్ల రికవరీ

ఇప్పటి వరకు రూ.1.6 కోట్ల విలువజేసే 664 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ విధానం దీనికి మరింత చేయూతనిస్తోంది. దీని ద్వారా సెల్‌ఫోన్‌ను త్వరితగతిన గుర్తించే అవకాశంతో పాటు ఫోన్లలో నిక్షిప్తమైన వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా బ్లాక్ చేయొచ్చు. ఈ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కోరారు.

- కోటమిట్టకు చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి షఫీ మొబైల్ ఫోన్ ఇటీవల పోయింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్లో ఫిర్యాదు చేశారు. పోగొట్టుకున్న మొబైల్‌ను సాంకేతికత ద్వారా రోజుల వ్యవధిలోనే పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు.
- నగరానికి చెందిన గోపాల్ తన ఐ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఆయన సైతం సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేశారు. రోజుల వ్యవధిలోనే ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితుడి చెంతకు చేర్చారు.

సీఈఐఆర్‌లో నమోదు ఇలా..

- మొబైల్‌ను పోగొట్టుకున్న బాధితులు తొలుత స్థానిక పోలీస్‌స్టేషన్లో వివరాలివ్వాలి.
- అనంతరం సీఈఐఆర్ (www.ceir.gov.in) వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్ / స్టోలెన్ మొబైల్ లింక్‌పై క్లిక్ చేయాలి. పోయిన సెల్‌ఫోన్లోని నంబర్, ఐఎంఈఐ, కంపెనీ పేరు, మోడల్, మొబైల్ కొనుగోలుకు సంబంధించిన బిల్లును అప్‌లోడ్ చేయాలి.
- మొబైల్ ఏ రోజు.. ఎక్కడ పోయింది, ఏ రాష్ట్రం, జిల్లా, ఏ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు, తదితర వివరాలను నమోదు చేయాలి.
- పోగొట్టుకున్న నంబర్‌పై సిమ్ కార్డును మరోసారి పొందాలి. ఈ నంబర్‌కు కంప్లయింట్ ఓటీపీ వస్తుంది
- పోలీస్‌స్టేషన్లో ఇచ్చిన కంప్లయింట్ కాపీని పోర్టల్లో అప్‌లోడ్ చేయాలి.
- చివరగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు (ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, తదితర ప్రభుత్వ గుర్తింపు పొందినవి), ఈ – మెయిల్ ఐడీని నమోదు చేయాలి.
- ప్రక్రియ పూర్తయిన అనంతరం ఐడీ నంబర్ వస్తుంది. సంబంధిత ఐడీ ఆధారంగా దర్యాప్తు ప్రక్రియతో పాటు మొబైల్ దొరికిన వివరాలను తెలుసుకోవచ్చు



సీఈఐఆర్ వెబ్‌సైట్

- మొబైల్ ఏ కంపెనీదైనా సీఈఐఆర్ విధానం దాన్ని పనిచేయకుండా చేస్తుంది. దీంతో పాటు కేసు ఛేదనలో జిల్లా పోలీసులకు ఉపయోగపడుతుంది.
- సెల్‌ఫోన్ లభ్యమైన అనంతరం బాధితుడు అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అన్‌బ్లాక్ / ఫౌండ్ మొబైల్ అనే లింక్‌పై క్లిక్ చేయాలి. ఐడీ నమోదు చేయగానే ఫోన్ అన్‌బ్లాక్ అవుతుంది.
- కేంద్రం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని నమోదు చేస్తే త్వరగా దొరికేందుకు అవకాశం ఉంటుంది.

డయల్ యువర్ కమిషనర్ నేడు

నెల్లూరు సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, 0861 – 2355678 నంబర్‌ను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. స్పందన కార్యక్రమంలో అర్జీలను సమర్పించాలని సూచించారు.

బస్టాండ్‌లో నగల పర్సు చోరీ

నెల్లూరు(క్రైమ్): బస్సెక్కే సమయంలో నగల పర్సు చోరీకి గురైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును ఆదివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఊటుకూరుకు చెందిన షాజహాని నగరంలోని తన కుమార్తె ఇంటికి ఈ నెల ఏడున వచ్చారు. తిరిగి ఇంటికెళ్లేందుకు గానూ ఆత్మకూరు బస్టాండ్‌కు వచ్చారు. బస్సెక్కే క్రమంలో ఆమె వద్ద గల నగల పర్సు అపహరణకు గురైంది. అందులో మూడు సవర్ల బంగారు ఆభరణాలున్నాయి. ఇంటికెళ్లాక చూసుకున్న ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. పర్సు కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బాధితుడికి అండగా..



బుచ్చిరెడ్డిపాళెం: ఇటీవల ఇస్కపాళెం గ్రామానికి చెందిన ఉప్పాల లక్ష్మయ్య కల్లు గీస్తూ చెట్టుపై నుంచి పడి గాయపడగా అతడిని ఆదివారం జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్ గౌడ్ పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచానికే పరిమితమైన లక్ష్మయ్యకు జిల్లా కల్లుగీత పారిశ్రామికుల సంఘం మరియు గౌడ్ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపకుడు దివంగత కోరుసూరు గోవిందయ్య ఆశయ సాధనలో భాగంగా నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెంచలయ్య, చిన్న గోవింద్, హజరత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు

కొడవలూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీల్లో ఇంటి నిర్మాణ లబ్ధిదారులు మరుగుదొడ్డి నిర్మించుకుంటే అదనంగా గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ.12 వేలు ఇస్తారని హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.80 లక్షలతోపాటు అదనంగా రూ.12 వేలు చెల్లిస్తామన్నారు. అయితే మరుగుదొడ్డి నిర్మాణం ఇంటి మెట్ల కింద కాకుండా బయట చేపట్టాలన్నారు. అదే విధంగా ఇంట్లోని వృథా నీరు రోడ్లపైకి వదలకుండా సోక్ పిట్ నిర్మాణం చేసుకుంటే అదనంగా రూ.6 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కేవలం మూడు వరలతో సోక్ పిట్ నిర్మించుకున్నా రూ.6 వేలు చెల్లిస్తామన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలకు కుర్చీల వితరణ



వెంకటాచలం: మండలంలోని కురిచెర్లపాడులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు మాజీ ఎంపీటీసీ యర్రబల్లి శ్రీనివాసులు, వీరేపల్లి రామచంద్రనాయుడు ఆర్థిక సహకారంతో ఆదివారం 40 కుర్చీ లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని పలువురు ఎస్టీలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, షబానా, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సర్పంచ్ ఆర్థిక సాయం



కొడవలూరు: మండలంలోని రేగడిచెలికలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు గ్రామ సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు ఆర్థిక సాయమందించారు. తల్లి లేదా తండ్రిని కోల్పోయిన 8 మంది చిన్నారులకు రూ.10 వేల వంతున ఇవ్వడంతోపాటు తల్లిదండ్రులిద్దర్నీ కోల్పోయిన ముగ్గురికి రూ.11 వేల వంతున రూ.1.13 లక్షల సొంత నిధులను సాయమందిచారు. ఈ మొత్తాన్ని గ్రామ సచివాలయంలో సర్పంచ్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆదివారం చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు సామాజిక బాధ్యతతో తన వంతు భరోసా కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో వారికి మరింత సాయపడడంతోపాటు ఇలాంటి చిన్నారులందరికీ అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తలమంచి సొసైటీ అధ్యక్షుడు దేవనబోయిన శివకుమార్, ఉప సర్పంచ్ తక్కెళ్లపాటి కళాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎస్.విజయకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మోటుపల్లి వెంకటేశ్వర్లు, తోడేటి సుబ్బారావు, మందాడి వెంకటేశ్వర్లు, నగళ్ల లింగయ్య, కట్టా పుల్లయ్య పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం

కొడవలూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెం, వెంకన్నపురం, నార్తురాజుపాళెంలో త్రైత సిద్ధాంత భగద్గీత గ్రంథాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డి.సుర మౌళి, సభ్యులు లీలావతి, మోహన్, కృష్ణ, మనోజ, సుందర్‌రాజా, కావ్యశ్రీ, వేణు, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, పద్మజ పాల్గొన్నారు.

20న మాదిగల మహా ప్రదర్శన



మాట్లాడుతున్న సుబ్బయ్య

నెల్లూరు(వేదాయపాళెం): మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేస్తూ నగరంలో ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన మాదిగల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య పిలుపునిచ్చారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఏబీఎం స్కూల్ మైదానం నుంచి వీఆర్సీ సెంటర్ వరకు మహా ప్రదర్శనను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంట్, అసెంబ్లీ, నామినేటెడ్ పోస్టుల్లో మాదిగలకు సమన్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు మాట్లాడారు. దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మాదిగల అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నేతలు బద్దెపూడి వెంకట్రావు, మందా పెంచలమ్మ, కామేష్, రఘురామ్, వెంకటరమణయ్య, చిరంజీవి, రేణుక, సరిత, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జూడో పోటీలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కొండాయపాళెంలోని ఇన్‌ఫంట్ జీసస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల సీనియర్ జూడో చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులు ఆదివారం హోరాహోరీగా తలపడ్డారు. 44 నుంచి 100 కిలోల విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఫైనల్స్, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి తెలిపారు. జూడో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఆనం రంగమయూర్‌రెడ్డి, జాతీయ కోశాధికారి కైలాష్‌యాదవ్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాంబాబు, సీఈఓ బాబు, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా అసోసియేషన్ కోశాధికారి వెంకట్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిణయ వస్త్ర ప్రదర్శన ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని స్వర్ణవేదిక కల్యాణ మండపంలో పరిణయ వస్త్ర ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు టీవీ రావు మాట్లాడారు. వివిధ రాష్ట్రాల చేనేతకారులు, డిజైనర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శనలో ఫ్యాషన్ ప్రియులు, మగువలు తమకు కావాల్సినవి కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎంతో పేరుగాంచిన కలంకారీ, మంగళగిరి ప్రింట్, సిల్క్ చీరలు, కాటన్, కశ్మీర్ సిల్క్, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, తదితరాలు అందుబాటులో తెలిపారు. ప్రదర్శన మంగళవారంతో ముగియనుందని వివరించారు.

అమీర్‌జాన్‌కు అవార్డు



నెల్లూరు(బృందావనం): నగరానికి చెందిన చిత్రకారుడు అమీర్‌జాన్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. తమిళనాడులోని జయలలిత మ్యూజిక్, ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ అనుబంధ సంస్థ శ్రీదర్శిని కలైకూడమ్ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ ఫెస్టివల్ 2022
- 23 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని చెన్నైలోని టీనగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీనగర్ ఎమ్మెల్యే కరుణానిధి తనకు అవార్డును అందజేశారని అమీర్‌జాన్ చెప్పారు.

ఘనంగా గంధ మహోత్సవం



దువా చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(బృందావనం): నగరంలోని 43వ డివిజన్లో గల కుండల దర్గా గంధ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రత్యేక దువా చేశారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి హంజా హుస్సేనీ, నేత అతహర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కే రన్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యువ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గానూ 3కే రన్‌ను నిర్వహించడాన్ని జేసీ కూర్మనాథ్ అభినందించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ 3కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్రా ప్రీమియర్ క్రికెట్ లీగ్ రెండో విడత పోటీలను విశాఖపట్నంలో ఈ నెల 16న ప్రారంభించనున్నారని వెల్లడించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సీవీఎస్ మూర్తి, ప్రధాన కార్యదర్శి నిఖిలేశ్వరరెడ్డి, అబూబకర్, శ్రీనివాసులురెడ్డి, కోచ్ మాధురి, ఫిట్‌నెస్ ట్రెయినర్ ప్రభాకర్, సీనియర్ క్రీడాకారులు రాజశేఖర్, శ్రీనివాసులు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

బిందుమీనన్‌కు నాయకత్వ ఫోరం అవార్డు

నెల్లూరు(బారకాసు): నగరంలోని అపోలో స్పెషాల్టీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్‌ను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ప్రతిష్టాత్మక పాలటుచి అడ్వొకసీ లీడర్‌షిప్ ఫోరమ్‌కు ఎంపిక చేశారు. లీడర్‌షిప్ ఫోరమ్‌కు దేశం నుంచి ఇప్పటి వరకు 8 మంది న్యూరాలజిస్టులే ఎంపికయ్యారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో గల శాన్‌డియాగోలో ఆగస్టు 3 నుంచి 7 వరకు నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ఆమెకు అందజేశారు.

పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు సాయం



ఇందుకూరుపేట: పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కళ్యాణ్ కుమార్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పారా స్పోర్ట్స్ క్రీడాకారులు ఈనెల 15 తేదీన విశాఖపట్నం రైల్వే ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కళ్యాణ్‌కుమార్‌రెడ్డిని నెల్లూరులోని నివాసంలో ఆదివారం క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించి నగదు చేశారు. పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

కుడితిపాళెంలో రక్తదాన శిబిరం

ఇందుకూరుపేట: ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కుడితిపాళెం గ్రామంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 59 మంది యువత రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ యూత్ సెక్రటరీ ప్రసాద్ మాట్లాడుతూ 27వసారి ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ ఎస్కే ముజీర్, సర్పంచ్ నాయుడు సురేష్, రాం సుబ్బారెడ్డి, ఇబాదుల్లా, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌ను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగర ప్రజల కోసం మంచి కార్యక్రమాలు చేస్తున్న నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను ఆశీర్వదించాలని డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 53, 54వ డివిజన్ల ప్రజల కోసం రాజన్న గుండె భరోసా కార్యక్రమాన్ని వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఎనెల్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 256 మందికి డాక్టర్ నాగేంద్రప్రసాద్ వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడారు. వైద్య శిబిరాల్లో ఉచితంగా రక్త, ఎకో పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ పరీక్షలనూ చేస్తున్నారని వివరించారు. కార్పొరేటర్లు దేవరకొండ సుజాత, సఫియాబేగం, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నగరంలోని పలు డివిజన్లలో డయేరియాకు సంబంధించిన ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచనల మేరకు 3 నుంచి 11, 39, 40, 47, 49 నుంచి 52వ డివిజన్లలో శిబిరాలను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, పోలంరెడ్డి ప్రత్యూష, రవిచంద్ర, మస్తానమ్మ, కిన్నెర మాల్యాద్రి, కామాక్షిదేవి, ప్రేమ్‌కుమార్, అరుణ, రామకృష్ణ, రాజేశ్వరి, జయలక్ష్మి, సాహిత్య, అస్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రూప్‌కుమార్‌యాదవ్ జన్మదినం



నెల్లూరు(దర్గామిట్ట): డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని జగనన్న భవన్‌లో భారీ కేక్‌ను కట్ చేశారు. మూలస్థానేశ్వర దేవస్థాన చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, కార్పొరేటర్ ఇంతియాజ్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మున్వర్, కమల్, సమీవుల్లా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.
- గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వైఎస్సార్ విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి హాజీ, సురేష్, కమల్, శ్రీను, జావీద్, షెహన్‌షా, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌మోపూరులో వైద్య శిబిరం




నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరులో ఉచిత వైద్య శిబిరాన్ని వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పలు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. చైతన్య, విజయ, సురేష్, మాల్యాద్రి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

పలు సేవా కార్యక్రమాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో పలు సేవా కార్యక్రమాలను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. నవలాకులతోటలోని నేతాజీ వృద్ధాశ్రమం, రైల్వేస్టేషన్, తదితర ప్రాంతాల్లో వృద్ధులకు ఆహార పొట్లాలు, తదితరాలను అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకుడు రమేష్, మురళీకృష్ణ, కార్తికేయ, శశికిరణ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించరూ..



వీఆర్‌ఏల నూతన కార్యవర్గం

నెల్లూరు(బృందావనం): అర్హులైన వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సమాఖ్య కోశాధికారి దేవిరెడ్డి రమణారెడ్డి కోరారు. పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో గ్రామీణ రెవెన్యూ సహాయకుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.

అనంతరం వీఆర్‌ఏ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడిగా బాలచెన్నయ్య, మహిళాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, గౌరవాధ్యక్షుడిగా మీరామొహిద్దీన్, ప్రధాన కార్యదర్శిగా చాన్‌బాషా, సహాయ ప్రధాన కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రచార కార్యదర్శిగా రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. గ్రామీణ వార్డు సచివాలయ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.